నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, ఆదివారం 1 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM




ఖమ్మం రూరల్: పొన్నెకల్లు జీఆర్ఆర్ మిల్లు వద్దకు పంటను తీసుకొచ్చిన వాహనాలు

- 'సొమ్మొకరిది.. సోకొకరిది..' మాదిరిగా పత్తి రైతుల దయనీయ స్థితి
- సాక్షాత్తూ రైతుతో సంతకం చేయించి మరీ సొమ్ము చేసుకుంటున్న దళారులు
- ఊరిలో రైతు పంటను కొని.. తిరిగి అతడి పేరిటే సీసీఐలో విక్రయం
- ఇందుకోసం ఏకంగా రైతుల పాస్‌బుక్‌లు, బ్యాంక్ ఖాతాల వినియోగం

# సరుకు ఒకరిది.. సంతకం మరొకరిది..

ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఏడాదంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్న అన్నదాతలు.. అడుగడుగునా వంచనకు గురవుతున్నారు. కాయకష్టం చేసి వారు పండించిన పంటను గ్రామాల్లో వారి వద్ద తక్కువ ధరకు కొంటున్న దళారులు.. చివరికి వారి పేరిటే సీసీఐలో మద్దతు ధరకు విక్రయిస్తూ లాభపడుతున్న దృశ్యాలు జిల్లాలో పుష్కలంగా కన్పిస్తున్నాయి. ఇందుకోసం సాక్షాత్తూ రైతులనే సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్తుండడం, వారితోనే అక్కడ సంతకాలు పెట్టిస్తుండడం, వారి పేరునే ఆన్‌లైన్‌లో చేయిస్తుండడం, ఆఖరికి పట్టా పాస్‌బుక్కులు, బ్యాంకు ఖాతాలను కూడా వారివే వినియోగిస్తుండడం వంటివి ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. దీంతో కర్షకుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నట్లు అవుతోంది. దళారులు తీసుకెళ్లి తమతో సంతకాలు పెట్టిస్తున్నా తమ పంటనే వారు విక్రయించుకుంటూ శ్రమలేని ప్రతిఫలాలు గడిస్తున్నారన్న విషయం తెలియని స్థితిలో రైతులు ఉండడం మరింత దయనీయం. రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనేందుకు తేమ పేరుతో తంటాలు పెడుతున్న సీసీఐ అధికారులు.. దళారులు తెస్తున్న అదే రైతుల పంటను కొనుగోలు చేస్తుండడం వెనుక ఏమి మర్మం ఉందో వారే చెప్పాలి.

-ఖమ్మం రూరల్, నవంబర్ 30

పత్తి రైతులకు మంచి ధర అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భారత పత్తి సంస్థ (సీసీఐ)ను ఏర్పాటుచేసింది. ఇది జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి దాని ద్వారా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తుంది. రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందిస్తుంది. అయితే ఈ కొనుగోళ్లలో పారదర్శకత కోసం అధికారులు అనేక పద్ధతులను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినా దళారులు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులతో రైతులను చిత్తు చేస్తూనే ఉన్నారు. అయితే సీసీఐ సహా ఇతర మార్కెట్ కమిటీ సిబ్బంది దళారులకు దాసోహమవుతూ అన్నదాతలను అరిగోస పెడుతున్నారు.





అన్నదాతలకు ఆసరాగా ఉండి, దళారుల ఆట కట్టించాల్సిన సిబ్బందే.. దళారుల కొమ్ము కాయవడంతో విధిలేని పరిస్థితిలో రైతులు తల వంచుకోవాల్సి వస్తోంది. ఈ వానకాలంలో పత్తి రైతులు సాగు చేసిన పంటకు మద్దతు ధర ఇచ్చి వారికి ఆర్థిక పరిపుష్టి అందించేందుకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సీసీఐ అధికారులు ఎనిమిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. అందులో భాగంగానే ఖమ్మం రూరల్ మండలంలో గుర్రాలపాడు, మద్దులపల్లి, పొన్నెకల్లు గ్రామాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతుల పంట కొనుగోళ్లు చేపడుతున్నారు. అయితే సీజన్ ఆరంభంలో తేమ శాతం ఎక్కువగా నమోదు కాకపోవడంతో ఆశించిన మేర క్రయవిక్రయాలు సాగలేదు. గడిచిన వారం రోజుల నుంచి పంట పూర్తిగా ఆరడంతో సీసీఐ కేంద్రాలకు వచ్చిన దాదాపు అన్ని వాహనాల్లోని పత్తి తేమ శాతం ఒకే విధంగా నమోదవుతోంది. సరిగ్గా ఇదే అదునుగా భావించిన దళారులు.. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తమ దందాకు పదునుపెట్టారు. కొణిజర్ల, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ముదిగొండ తదితర మండలాల్లో కొంటర్లు పెట్టి రైతుల వద్ద క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6,400 చొప్పున వెచ్చించి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. అక్కడ కొనుగోలు చేసిన పంటను సీసీఐకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరికీ, ఎక్కడా అనుమానం రాకుండా తమ వ్యూహాలకు పదను పెడుతున్నారు.

### ఊళ్లలో కొనడం.. సీసీఐలో అమ్మడం..

'వడ్డించే వాడు మనవాడైతే..' అనే సామెతలా ఉంది సీసీఐ కేంద్రాల్లో దళారుల తీరు. అతివృష్టి, చీడపీడల కారణంగా ఇప్పటికే దిగుబడులు గణనీయంగా తగ్గి అన్నదాతలు గోస పడుతున్నారు. ఇలాంటి తరుణంలో అన్నింటినీ తట్టుకొని చేతికొచ్చిన పంటను రైతులు సీసీఐ కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ వారిని దళారులు దగా చేస్తున్నారు. గ్రామాల్లో రైతుల వద్ద పంటను కొనుగోలు చేస్తున్న దళారుల్లోని కొందరు అడ్తీవ్యాపారులు కూడా ఈ దందా చేస్తున్నారు. రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, కొణిజర్ల మండలాలకు చెందిన కమీషన్ వ్యాపారులు ఊళ్లలో తాము అప్పులిచ్చిన రైతుల వద్ద పంటను కొనుగోలు చేస్తున్నారు. ఆ పంటను అక్కడి నుంచి నేరుగా సీసీఐ కేంద్రాలకు తరలిస్తున్నారు. పై పెచ్చు.. పంటను కొనుగోలు చేసిన తరువాత అదే రైతులను సీసీఐ కేంద్రాల వద్దకు తీసుకెళ్లి సీసీఐ నిబంధనల ప్రకారం వారితో సంతకాలు చేయిస్తున్నారు. రైతులు రాని పక్షంలో వచ్చిన రైతులతోనే అనేక ఫొటోలు తీయించి సీసీఐ సైట్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. సీసీఐ సెంటర్ల వద్ద ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే సిబ్బంది రైతులతో రకరకాలుగా వేశాలు వేయించి పంటను పాస్ చేయించడం విశేషం.

### సంతకం కోసమని ఇక్కడికి తీసుకొచ్చారు.



'సంతకం పెట్టి వెంటనే వద్దువుగాని రా..' అంటే ఇక్కడికి వచ్చాను. నాలుగు రోజుల క్రితం నేను పండించిన పంటను మా ఊరి అతడికి అమ్మాను. క్వింటాకు రూ.6,400 చొప్పున బేరం కుదిరింది. నాతోపాటు మా గ్రామంలో చాలామంది పత్తి పంటను అతడికి అమ్మారు. అయితే, 'ఈ రోజు మీరు వచ్చి సంతకం పెట్టాలి' అంటే వచ్చాను. ఉదయం నుంచి నన్ను ఈ సీసీఐ కేంద్రం వద్దనే ఉంచారు. ఇప్పటికి మూడుసార్లు నన్ను ఫొటో దింపారు. ఒకసారి తువ్వాలతో దింపారు. మరోసారి తువ్వాల లేకుండా దింపారు. ఎందుకు తీసుకొచ్చారో తెలవడం లేదు. నాతోపాటు చాలామంది సంతకాలు పెట్టేందుకు ఈ జిన్నింగ్ మిల్లు వద్దకు వచ్చారు.

– వెంకటేశ్వర్లు, బాధిత రైతు, పెద్దగోపతి



సుజాతనగర్: డేగలమడుగులో జిన్నింగ్ మిల్లు వద్ద బారులు తీరిన పత్తి వాహనాలు

## బజారున 'భద్రాద్రి' పత్తి రైతులు

### 'సీసీఐ'లో విక్రయించుకునేందుకు రోజుల తరబడి ఎదురుచూపులు

### తేమ శాతం పేరిట చుక్కలు చూపిస్తున్న కాటన్ కార్పొరేషన్ అధికారులు

కొత్తగూడెం టౌన్, నవంబర్ 30: భద్రాద్రి జిల్లాలో పత్తి సాగు చేసిన రైతులు కూడా బజారున పడ్డారు. తమ పత్తిని విక్రయించేందుకు సీసీఐ కేంద్రాలకు వెళ్తున్న దూదిపూల రైతులు రోజుల తరబడి రోడ్డుపై వేచి చూడాల్సి వస్తోంది. దీంతో అక్కడికి కూడా దళారులు రంగ ప్రవేశం చేసి పత్తి రైతులను దోచుకుంటున్న తీరు కన్పిస్తోంది. ఇప్పటికే రైతుల ఇళ్లకు వెళ్లి పత్తిని తక్కువకు కొనుగోలు చేస్తున్న దళారులు.. తిరిగి వారి పంటనే, అది కూడా వారి పేరిటో సీసీఐలో మద్దతు ధరకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. ఫలితంగా కష్టం చేసి పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భద్రాద్రి జిల్లా రైతులు ఈ ఏడాది 2,01,216 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. 16 లక్షల టన్నులకు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతో సీసీఐ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుగానే దళారులు రంగం సిద్ధం చేసుకున్నారు. రైతుల దగ్గర తక్కువ ధరకు కొని సీసీఐలో రూ.7521 మద్దతు ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక అధికారులు కూడా జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలను పేరుకే ఏర్పాటు చేసినట్లుగా కన్పిస్తోంది. ఆయా జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కేంద్రాలు ప్రారంభించినా.. రైతులను మాత్రం రోజుల తరబడి పాడిగాపులు కాయిస్తున్నారు. సుజాతనగర్‌లోని మంజిత్ కాటన్ మిల్లు, కారేపల్లిలోని శ్రీలక్ష్మీకాటన్ మిల్లు, అశ్వాపురంలోని శ్రీరామ కాటన్ మిల్లు, లక్ష్మీపురంలోని అనుశ్రీ ఇండస్ట్రీస్‌లలో నిత్యం ఇదే పరిస్థితి కన్పిస్తోంది.

### రెండు రోజులుగా లైన్‌లో ఉన్నాను..



పత్తిని విక్రయించేందుకు సీసీఐ వద్ద రెండు రోజులుగా లైన్‌లో ఉన్నాను. తేమ శాతాన్ని సాకుగా చూపి రోజుల తరబడి ఆలస్యం చేశారు. ఒకవేళ విక్రయించినా నగదు కూడా ఆలస్యంగా జమ అవుతోంది. అదే సమయంలో ఇదే కేంద్రాల్లో ట్రేడర్లు వచ్చి విక్రయాలు చేసుకుంటున్నారు.

–కే.హనుమాన్, పాండురంగాపురం, పాల్వంచ

### రైతులకు ఇన్ని కష్టాలా?



ఇదేమి సర్కారో అర్థం కావడం లేదు. పత్తిని అమ్ముకునేందుకు వచ్చే మాలాంటి రైతులకు ఇన్ని కష్టాలా? రోజుల తరబడి సీసీఐ కేంద్రాల్లోనే ఉంటే.. పంట చేలలో పనులు ఎలా చేసుకోవాలి? రెండు రోజులుగా మా బండిని లైన్‌లోనే పెట్టి ఉంచాను. దీంతో బండికి అద్దె పెరుగుతోంది.

–అంజయ్య, బేతాలపాడు, జూలూరుపాడు

### ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం..



రైతులు ఒక్కసారిగా జిన్నింగ్ మిల్లు వద్దకు రావడంతోనే లైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో కొనుగోళ్లలో వేగం పెంచాలని సీసీఐ అధికారులకు సూచించాం. తేమ శాతం ఎక్కువ ఉంటోందని సీసీఐ అధికారులు చెబుతున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

–నరేందర్, డీఎంవో, కొత్తగూడెం

---

## పాఠశాలల్లో 'ఫుడ్ పాయిజన్'పై.. సీఎం బాధ్యత వహించాలి

- ఇంకెంతకాలం ఈ పురుగుల అన్నం, నీళ్ల చారు?
- కాంగ్రెస్ సర్కారుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ఖమ్మం బంద్ సక్సెస్.. జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు..




ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

రఘునాథపాలెం, నవంబర్ 30: ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ డిమాండ్ చేశాయి. అధికారం చేపట్టి ఏడాది కావొస్తున్నా ఇంకెంతకాలం ఈ పురుగుల అన్నం, నీళ్ల చారు పెడతారని ప్రశ్నించాయి. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో నాణ్యమైన ఆహారం అందక విద్యార్థులు అనారోగ్యాల భారిన, మరణాల భారిన పడుతుండడాన్ని ప్రశ్నిస్తూ ఆయా విద్యార్థి సంఘాల నేతలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, వెంకటేశ్, మస్తాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లోని భోజనంలో నాణ్యత లేకపోవడం వల్లనే విద్యార్థులు ఫుడ్ పాయిజన్ భారిన పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వరుస ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సంఘాల నేతలు పాల్గొన్నారు.

---

## 'ధరణి' దరఖాస్తులను పరిష్కరించాలి

- ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ వేగవంతంగా పూర్తిచేయాలి
- అధికారుల సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ కొత్తగూడెం అర్బన్, నవంబర్ 30: ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, పీఎం కుసుమ్ పథకం, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. దరఖాస్తులు ఏ కారణాలతో పరిష్కరించబడలేదో లిఖితపూర్వక సమాచారాన్ని పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమగ్ర ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించాల్సిందిగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు సూచించారు. సోలార్ పవర్‌ప్లాంట్ స్థాపనకు ప్రభుత్వ



సిబ్బందితో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్


### షాపింగ్ కాంప్లెక్స్‌లను వినియోగంలోకి తేవాలి

కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు గడిచిన రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయని, తక్షణమే వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేశ్ ఆదేశించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లను శనివారం ఆయన పరిశీలించారు. మున్సిపల్ షాపింగ్‌కాంప్లెక్స్‌లో మహిళా సంఘాలతో ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వివిధ రకాల టిఫిన్లు, స్నాక్స్, భోజనంతోపాటు రుచికరమైన ఆహార పదార్థాలను మహిళా సంఘాలు తయారు చేసుకొని ఇక్కడే వ్యాపారాలు జరిపేలా చూస్తామన్నారు. కమిషనర్ శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి పాల్గొన్నారు.

---

## హవ్వ.. ఇవి సంబురాలా?

- 'భద్రాద్రి'లో తుస్సుమన్న ప్రజాపాలన వేడుకలు
- ప్రకాశం స్టేడియంలో జనం లేక ఖాళీ కుర్చీల దర్శనం



జనంలేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): అట్టహాసంగా జరుపుతామన్న ప్రజాపాలన సంబురాలు భద్రాద్రి జిల్లాలో తుస్సుమన్నాయి. ఖాళీ కుర్చీలతో సభ వెలవెలబోయింది. దీనిని చూసిన జిల్లా కేంద్ర వాసులు.. 'హవ్వ.. ఇవి సంబురాలా?' అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో శనివారం రాత్రి ప్రజాపాలన వేడుకలు నిర్వహించారు. అయితే వేదిక మీదున్న కళాకారులకే ఈ సంబురాలు పరిమితమయ్యారు. వందలాది మందికి కుర్చీలు వేస్తే కనీసం 20 మంది కూడా రాలేదు. వచ్చిన ఆ 20 మంది కూడా జనంలేక తిరుగుముఖం పట్టారు. కళాకారులు వారికి వారే పాటలు పాడుకొని వెళ్లిపోయారు. అధికారులు కూడా ఎవరూ రాలేదు. ఒక్క డీపీఆర్వో మాత్రమే హాజరయ్యారు. చివరికి ముఖ్య అతిథి కలెక్టర్ కూడా హాజరుకాకపోవడంతో కళాకారులు అరగంటలోనే వేడుకలను ముగించారు.

### పదిమంది కూడా లేని జనాలు..

తమ సర్కారు కొలువుదీరి ఏడాది అవుతోందంటూ ప్రజాపాలన విజయోత్సవాలకు కాంగ్రెస్ సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్తగూడెంలో అట్టహసంగా చేయాలనుకున్నప్పటికీ ప్రజలెవరూ పెద్దగా రాలేదు. హామీల అమల్లో విఫలమైన ప్రభుత్వం పట్ల విసిగిపోయిన జనాలు.. సంబురాలకు ససేమిరా అన్నారు. వేడుకల వద్ద వందలాది కుర్చీలు వేసినప్పటికీ పట్టుమని పదిమంది కూడా రాలేదు.

### ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న సర్కారు..

హామీలు అమలు చేయకపోవడం, రైతు భరోసా ఇవ్వకపోవడం, రుణమాఫీ చేయకపోవడం వంటి కారణాలతో ప్రజల్లో సర్కారుపై విశ్వాసం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ అధికారికం కార్యక్రమాలకు సైతం జనం పెద్దగా రావడం లేదని ఈ సంబురాల ద్వారా అర్థమవుతోంది. మూడు గంటల పాటు జరగాల్సిన సంబురాలు అరగంటలోనే పూర్తి చేయాల్సి వచ్చిందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో 60 మంది కళాకారులు వచ్చారు. ప్రభుత్వ పథకాల గురించి ఆడిపాడాలనుకున్నారు. కానీ జనం రాలేదు. దీంతో ప్రముఖ గాయకుడు, సాంస్కృతిక శాఖ బాధ్యుడు అంతడుపుల నాగరాజు బృంద సభ్యులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

---

## అమెరికాలో ఖమ్మం విద్యార్థి హత్య

- అక్కడి షాపింగ్ మాల్‌లో దుండగుల కాల్పుల్లో దుర్మరణం
- ఐదు నెలల క్రితమే ఉన్నత చదువు కోసం వెళ్లిన సాయితేజ
- శోకసంద్రంలో కుటుంబం.. రామన్నపేటలో విషాదం..



అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన నూకారపు సాయితేజ(ఫైల్)



ఖమ్మంలో సాయితేజ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

రఘునాథపాలెం, నవంబర్ 30: అగ్రరాజ్యం వెళ్తున్నాడంటే ఆ కుటుంబీకులు సంబురపడ్డారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్తానంటే కష్టమైనా సరేనని పంపించారు. అక్కడ చదువుకుంటూనే పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నానంటే మురిసిపోయారు. కానీ, ఆ తల్లిదండ్రుల సంతోషం ఎక్కువ కాలం నిలువలేకదు. ఎంఎస్ కోసం అమెరికా వెళ్లిన కొడుకు.. దుండగుల కాల్పుల్లో దుర్మరణం చెందాడన్న దుర్వార్త ఆ తల్లిదండ్రులను శోకసంద్రంలోకి ముంచింది. అంతకుముందు రోజు రాత్రే వీడియో కాల్ మాట్లాడిన కొడుకు.. తెల్లారే సరికే కానరాని లోకాలకు చేరాడనే ఫోన్ కాల్ విన్న ఆ తల్లిదండ్రులు.. దిగ్భ్రాంతికి గురయ్యారు. 'భగవంతుడా?' అంటూ గుండెలవిసేలా రోదించారు.

ఖమ్మం రామన్నపేట ప్రాంతానికి చెందిన నూకారపు కోటేశ్వరరావు – వాణి దంపతులకు కుమార్తె, కుమారుడు సాయితేజ (22) ఉన్నారు. సాయితేజ ఎంఎస్ చదివేందుకని ఈ ఏడాది జూన్ 15న అమెరికా వెళ్లాడు. అక్కడి చికాగో రాష్ట్రం కాంకోడియా యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ చదువుతున్నాడు. కొద్దిరోజుల క్రితం అక్కడే ఓ షాపింగ్‌మాల్‌లో కౌంటర్ మేనేజర్‌గా పార్ట్‌టైమ్ జాబ్‌లో చేరాడు. శుక్రవారం పార్ట్ టైమ్‌జాబ్ చేస్తున్న క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు షాపింగ్‌మాల్‌లోకి చొరబడి డబ్బులివ్వాలని సాయితేజను డిమాండ్ చేశారు. దీంతో భయపడిన సాయితేజ.. కౌంటర్ నుంచి డబ్బులు తీసి వారికి ఇచ్చాడు. అయినప్పటికీ ఆ దుండగులు సాయితేజపై కాల్పులు జరిపి వెళ్లిపోయారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉంటున్న సాయితేజ బంధువులు ఈ విషయాన్ని తెలుసుకొని ఖమ్మంలోని అతడి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. సాయితేజ మృతితో కుమారుడిపై ఆ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి.

### సాయితేజ ఇంటివద్ద విషాదఛాయలు

సాయితేజ హత్యకు గురి కావడంతో ఖమ్మంలోని అతడి ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. స్వస్థలమైన రామన్నపేటకు పెద్దఎత్తున బంధువులు తరలివచ్చి సాయితేజ తల్లిదండ్రులను ఓదార్చుతున్నారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటుతున్నాయి. కాగా, సాయితేజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శించారు. సాయితేజ మృతదేహాన్ని ఖమ్మానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తానా ప్రతినిధులను ఆయన కోరారు. అలాగే, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా సాయితేజ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.